సాక్షి
హనుమకొండ
గురువారం | 4 | జనవరి | 2024



భూములను కాపాడాలి
రాష్ట్రంలో అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను కబ్జాదారుల నుంచి విడిపించాలని గంగు ఉపేంద్రశర్మ కోరారు. - 8లో ▸



భక్తులకు ప్రశాంత దర్శనం
మేడారం సమ్మక్క-సారలమ్మను భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు. - 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31°/18°
జిల్లాలో ఉదయం చలితో పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి వేళ పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సీపీని కలిసిన సాంగ్లీ కలెక్టర్



వరంగల్ క్రైం: మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా కలెక్టర్ డాక్టర్ రాజ దయానిధి బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను కలిసి పూలమొక్క అందజేశారు. వ్యక్తిగత కార్యక్రమాలపై వరంగల్‌కు వచ్చిన కలెక్టర్ రాజ దయానిధి సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఇరువురు అధికారులు పలు అంశాలపై ముచ్చటించుకున్నారు.

భరతనాట్యంలో సనయ కృతి ప్రతిభ



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ ఎం.సంజీవరావు కూతురు సనయ కృతి ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన భరత నాట్య పోటీల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించింది. 2023 డిసెంబర్ 30, 31 తేదీల్లో జరిగిన ఇంటర్నేషనల్ మల్టీ లింగ్వల్ ప్లే డాన్స్ అండ్ మ్యూజిక్ కాంటెస్ట్ ఫెస్ట్-13వ కృష్ణ రంగ్ మహోత్సవ్ -23 పోటీల్లో సనయ ద్వితీయ స్థానంలో నిలిచి అవార్డును కైవసం చేసుకుంది. ఈమేరకు బుధవారం నాట్య గురువు దివ్య, సీఐ సంజీవరావు చిన్నారిని అభినందించారు.

‘టెమ్రిస్’ ఆర్‌ఎల్‌సీ-1గా నీరజ నియామకం



న్యూశాయంపేట: తెలంగాణ మైనార్టీ గురుకులాల విద్యా సంస్థ(టెమ్రిస్) ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ లెవల్ కో-ఆర్డినేటర్ -1గా హనుమకొండ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ ముత్తిరెడ్డి నీరజను నియమిస్తూ.. సెక్రటరీ బి.షఫియుల్లా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆర్‌ఎల్‌సీగా పని చేసిన శ్రీపాలకు నర్సంపేట బాలికల గురుకులం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హనుమకొండ బాలికల గురుకులం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కెమిస్ట్రీ జూనియర్ లెక్చరర్ కె.వాసవికి పోస్టింగ్ ఇస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌ఎల్‌సీ-1 నీరజ వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల పరిధి 11 గురుకుల పాఠశాలలు, కళాశాలలను పర్యవేక్షించనున్నారు.

6న జాబ్ మేళా

హన్మకొండ అర్బన్: వడ్డేపల్లిలోని పింగిళి మహిళా ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈనెల 6న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఐఈఓ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం కోసం జరిగే ఈ ఎంపికలకు ఇంటర్మీడియెట్ ఎంపీసీ/ఎంఈసీలలో 75 శాతం మార్కులు సాధించిన ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావొచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 75691 77071 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరంగల్-1 డిపో మేనేజర్‌గా మోహన్‌రావు



హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్‌గా వంగల మోహన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వి.వెంకటేశం మియాపూర్ ఏడబ్ల్యూఎం-బీబీడబ్ల్యూగా బదిలీ అయ్యారు. వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావును వరంగల్-1 డిపో మేనేజర్‌గా బదిలీ చేయడంతో బుధవారం హనుమకొండలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



హన్మకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి కె.మధురిమ అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో సావిత్రి బాయిపూలే జయంతిని జరుపుకున్నారు. ముందుగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి జిల్లా సంక్షేమాధికారి కె.మధురిమ, కార్పొరేటర్ గుజ్జుల వసంత, శాంతి, న్యాయ ఉద్యమకారిణి నదీంబేగ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ గుజ్జుల వసంత, మహేందర్‌రెడ్డి, మహిళా అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కుమారస్వామి, టైలరింగ్, మగ్గం టీచర్లు భాగ్య, పద్మ, మాధవి, మహిళలు, పాల్గొన్నారు.

పేదింటి కల చెదిరింది!

గృహలక్ష్మి రద్దుతో రోడ్డున పడిన పేద కుటుంబాలు

- పుస్తెలు తాకట్టు.. భారమవుతున్న వడ్డీలు
- ఒక్క బిల్లు కూడా రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు
- నిర్మాణం పూర్తవ్వకపోగా.. ఇందిరమ్మ ఇల్లు ఇస్తారో లేదోనని ఆందోళన
- డబ్బులు తీసుకున్నారంటున్న ఎమ్మెల్యే రేవూరి
- నిరూపించాలంటున్న మాజీ ఎమ్మెల్యే చల్లా



పరకాల ఎస్సీ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న గృహలక్ష్మి ఇల్లు

పరకాల: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేదల ఇంటి కల.. స్వప్నంగానే మిగిలింది. ఇల్లు లేని నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణం సాధ్యం కావట్లేదని గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు గృహలక్ష్మి పథకాన్ని తెచ్చింది. చాలా మంది పేదలు దరఖాస్తు చేసుకోగా.. ఒక్కో నియోజకవర్గానికి 3,600 ఇళ్లను మంజూరు చేసింది. వారంతా అప్పోసప్పో చేసి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. చివరికి ప్రభుత్వం మారడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

ప్రొసీడింగ్‌లు బుట్టదాఖలేనా?

అధికారుల అంచనా ప్రకారం పరకాల నియోజకవర్గంలో మొదటి స్టేజ్ (బెడ్ లెవల్)లో.. 3,400 ఇళ్లు ఉండగా.. రెండో స్టేజ్ (స్లాబ్ లేదా గోడల దశ)లో 1,000కి పైగా ఉన్నాయి. మొదటి విడతలో రూ.1లక్ష, రెండో విడతలో రూ.1 లక్ష, మూడో విడత (ఇల్లు నిర్మాణం పూర్తి) అయితే రూ.1లక్ష మొత్తం రూ.3 లక్షలను నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయనున్నట్లు ప్రొసీడింగ్‌లో పేర్కొన్నారు. వీటిలో మొదటి దశలో ఉన్న 3,400 ఇళ్లలో 1,200 ఇళ్లు జియోట్యాగింగ్ ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల తర్వాత కూడా జిల్లా నోడల్ అధికారులు సైతం వాటిని పరిశీలించారు. అయితే ఎన్నికల కోడ్‌తో ఎవరికీ బిల్లులు మంజూరు కాలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇల్లు కూడా ఉండడంతో గృహలక్ష్మి లబ్ధిదారులు గతంలో ఇల్లు మంజూరైన తమకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రజాపాలన ద్వారా అధికారులకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది.

ఒక్కో కుటుంబం రూ.4 లక్షల వరకు అప్పు

గృహలక్ష్మి ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి రూ.2 నుంచి 4లక్షల వరకు అప్పు చేశారు. లబ్ధిదారులంతా నిరుపేదలు కావడంతో చేతిలో చిల్లిగవ్వ లేక పుస్తెలు అమ్ముకుని కొందరు, బంగారం కుదువబెట్టి ఇంకొందరు.. రూ.3 లక్షల నుంచి రూ.5 వడ్డీకి అప్పులు చేసి నిర్మాణాలు మొదలెట్టారు. బిల్లు రాగానే తిరిగి అప్పు చెల్లిస్తామని అప్పు కాగితాలు రాసుకున్నారు. కానీ.. గృహలక్ష్మి రద్దు కావడంతో ఆందోళనలో పడ్డారు.

ఇళ్లు కూల్చుకొని.. గృహలక్ష్మి నిర్మాణాలు

ఖాళీ స్థలం ఉన్న వారికే గృహలక్ష్మి ఇల్లు మంజూరు చేస్తామని అధికారులు తెలపడంతో చాలా మంది ఉన్న ఇళ్లను కూల్చుకుని నిర్మాణాలు మొదలుపెట్టారు. అలా.. చాలా మంది చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవిస్తుండగా.. మరికొందరేమో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో కాలం వెళ్లదీస్తున్నారు.



ఈఫొటోలో ఉన్న మహిళ పేరు వర్ధం పద్మ. ఈమెది పరకాలలోని హరితనగర్. గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరైందని రూ.3లక్షల అప్పు చేసి నిర్మాణ పనులు మొదలుపెట్టింది. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్లాబ్ వరకు పోసుకున్న రెండు బిల్లులు ఇస్తామనడంతో పద్మ అప్పు చేసి మరీ స్లాబ్ పోసుకుంది. కానీ.. ఒక్క బిల్లు కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం మారడంతో ఆమె అయోమయంలో పడింది. దిక్కుతోచని స్థితిలో ప్రస్తుతం గుడిసెలో ఉంటోంది. కొత్త ముఖ్యమంత్రి, కొత్త ఎమ్మెల్యే తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకుంటోంది.

> ‘పరకాల నియోజకవర్గంలో గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక వేగవంతంగా జరిగింది. అత్యధికంగా నిర్మాణ పనులు చేపట్టిన నియోజకవర్గాల్లో తెలంగాణ రాష్ట్రంలో నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంది.’ ఈమాటలన్నది ఎవరో కాదు.. కలెక్టర్ సిక్తా పట్నాయక్. కలెక్టర్ నుంచే ప్రొసీడింగ్స్ మంజూరు కావడంతో చాలా మంది అర్హులు నిర్మాణ పనులు ప్రారంభించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇచ్చారు..



ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తెరపైకి తీసుకొచ్చింది. వాస్తవానికి నిరుపేదలపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల కోడ్‌కు 45 రోజుల ముందే ఇళ్ల బిల్లులు ఇచ్చి న్యాయం చేసేవాళ్లు. ఇళ్లు ఇవ్వడానికి చాలా మంది బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు డబ్బులు వసూలు కూడా చేశారు. అర్హులైన జాబితాలో నిరుపేదలకంటే బీఆర్‌ఎస్ కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతోంది. గృహలక్ష్మి లబ్ధిదారులకు మళ్లీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలా? వద్దా? అనేది ప్రభుత్వం తీసుకునే విధి విధానాలపై ఆధారపడి ఉంటుంది.

- రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే

పేదలకు అన్యాయం జరిగితే ఊరుకోను



గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగింది. దరఖాస్తులపై స్వయంగా కలెక్టర్ విచారణ జరిపి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆరోపిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల నిర్ణయం ఏం లేదు. ఇల్లు ఇవ్వడానికి ఒక్క పైసా తీసుకున్నా.. రేవూరి నిరూపించాలి. అయినా గృహలక్ష్మి లబ్ధిదారులకు అన్యాయం జరిగితే ఊరుకోనేది లేదు. వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వంతో పోరాడతా.

- చల్లా ధర్మారెడ్డి, పరకాల మాజీ ఎమ్మెల్యే

పసిపిల్లలతో ఇంకెన్నాళ్లు ఇట్లా బతుకుడు?



గతంలో డబుల్ బెడ్‌రూం ఇల్లుకు దరఖాస్తు పెట్టుకుంటే రాలేదు. మళ్లీ గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకుంటే అధికారులు వచ్చి చూసుకొని మాకు ఇల్లు వచ్చినట్లు ప్రొసీడింగ్ ఇచ్చారు. దీంతో మేం ఉన్న ఇల్లు కూల్చుకొని నా భార్య బంగారం కుదువపెట్టి, మరో రూ.2లక్షలు అప్పు చేసి ఇంటి పనులు మొదలు పెట్టినం. బిల్లు కోసం ఎదురుచూస్తుంటే కొత్త ప్రభుత్వం గృహలక్ష్మిని రద్దు చేసింది. అప్పు ఎట్ల తీరుతుందో భయమేస్తోంది. గృహలక్ష్మికి బదులు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

- బొచ్చు ఆనందం, ఎస్సీ కాలనీ, పరకాల

ఏఐసీసీ ఇన్‌చార్జ్‌ను కలిసిన ఇనగాల



ఆత్మకూరు: వరంగల్ జిల్లా సీనియర్ నేత, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి బుధవారం ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపదాస్ మున్షీని హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కలిశారు. పరకాల ఎమ్మెల్యే స్థానాన్ని రేవూరి ప్రకాశ్‌రెడ్డికి కేటాయించడంతో తనకు ఎమ్మెల్సీ టికెట్ ఇస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేసినట్లు వెంట్రామ్‌రెడ్డి తెలిపారు. తనకు మద్దతు పలికిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తామని దీప్‌దాస్ మున్షీ అన్నారని ఇనగాల తెలిపారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారుల్ని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, డీఈఓ అబ్దుల్‌హైతో కలిసి పదో తరగతి విద్యార్థుల పరీక్షలకు సన్నద్ధత, బోధన, శిక్షణ అంశాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. మార్చి 18 నుంచి జరగబోయే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధమయ్యేలా సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయడంలో ఉపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందించిన ఆయా సబ్జెక్టుల సిలబస్, టెస్టులు, అందించిన స్టడీ మెటీరియల్, ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి ఆయా విద్యాలయాల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, విషయ నిపుణులు సంపతి, మహేశ్, సతీశ్, ప్రకాశ్, శ్రీను, ఆనంద్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, టీఎస్ రెసిడెన్షియల్ ఆర్‌సీఓలు పాల్గొన్నారు.

లక్ష్యంతో విధులు నిర్వర్తించండి

డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

ఎంజీఎం: పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ కేంద్రాల నోడల్ సిబ్బంది తమకు కేటాయించిన ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలో నోడల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీల వారీగా జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ, క్షయ వ్యాధి నియంత్రణ, మాతా శిశు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. హెల్త్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో జ్వర లక్షణాలున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించాలన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహించాలని, మలేరియా, డెంగ్యూ ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని రిపోర్టింగ్ విధానాన్ని మెరుగుపర్చాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్‌పాషా మాట్లాడుతూ.. టి- డయాగ్నస్టిక్ హబ్‌లో ఉచితంగా అందిస్తున్న సేవల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జిల్లా టీబీ నియంత్రణాధికారి హిమబిందు, డెమో అశోక్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ అధికారులు మాధవరెడ్డి, లింగమూర్తి, జ్యోతి, శిరీశ్ పాల్గొన్నారు.

ప్రజాపాలనను సమర్థంగా నిర్వహించండి

- ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్ల



ట్రెయినీ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల అధికారులు

దామెర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్ల అన్నారు. ప్రజాపాలన గ్రామ సభల్లో భాగంగా మండలంలోని సింగరాజుపల్లి, ల్యాదెళ్లలో ఆమె పర్యటించి దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి అధికారులకు సూచనలిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదు గ్యారంటీల అమలులో భాగంగా ప్రతీ కుటుంబం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణలో అధికారులు అలసత్వం వహించవద్దన్నారు. మండల అధికారులు శ్రద్ధాశుక్లను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సమావేశాల్లో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంరెడ్డి, మండల ప్రత్యేక అధికారి మాధవీలత, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్ రావు, ఎస్సై కొంక అశోక్, ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీఓ రంగాచారి, ఏఓ శ్రీనివాస్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సీ, డీటీ ఖురేషీ, ఆర్‌ఐ సంపత్‌రెడ్డి, సర్పంచ్‌లు కుక్క శ్రావ్య అనిల్, ఉప్పుల రజిత, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దు
అడిషనల్ కలెక్టర్ మహేందర్



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న అధికారులు

నడికూడ: ప్రజలకు ఇబ్బందులు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలని అడిషనల్ కలెక్టర్ మహేందర్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా బుధవారం మండలంలోని కంఠాత్మకూర్, పులిగిల్ల గ్రామాల్లో అభయహస్తం దరఖాస్తు కౌంటర్లను పరిశీలించారు. ఈసందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలకు ఒకే దరఖాస్తు చాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుండాల నాగరాజు, ఎంపీఓ సయ్యద్ అఫ్జల్, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘గ్రేటర్’లో బీఆర్‌ఎస్‌కు షాక్

ఆరుగురు కార్పొరేటర్లు, నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

- ఆహ్వానించి కండువా కప్పిన పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపదాస్ మున్షీ
- మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్‌ను కలిసిన నాయకులు



సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్‌లో పలువురు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌కు షాక్ ఇచ్చారు. ఆ పార్టీకి చెందిన ఆరుగురు కార్పొరేటర్లు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్, కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరారు. బుధవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షీ సమక్షంలో చేరారు. ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హనుమకొండ బీఆర్‌ఎస్‌కు చెందిన 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, 49వ డివిజన్ - మానస, 50వ డివిజన్ - నెక్కొండ కవిత, 9వ డివిజన్ - చీకటి శారద, 48వ డివిజన్ - షార్జా బేగం, 31వ డివిజన్ - మామిండ్ల రాజయ్య(రాజు) కాంగ్రెస్ చేరారు. అంతేకాకుండా మాజీ కార్పొరేటర్లు వీరగంటి రవీందర్ స్వామి చరణ్, తాడిశెట్టి విద్యాసాగర్, మోహన్ రావు, చీకటి ఆనంద్, నెక్కొండ కిషన్, నలుబోల సతీశ్, నాయకులు గోల్కొండ రాంబాబు, మైసారపు సిరిల్ లారెన్స్, సిలువేరు విజయ్ భాస్కర్, పోగుల శ్రీనివాస్ అధికార పార్టీలోకి వెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకన్న, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్ సయ్యద్ విజయశ్రీ, నాయకులు రజాలీ, బంక సరళ సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

గ్రేటర్ పట్టుకోసం కాంగ్రెస్ పావులు



గాంధీభవన్ ఎదుట ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, కార్పొరేటర్లు, నాయకులు

గ్రేటర్ మున్సిపాలిటీపై పట్టుబిగించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా వలసల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల ముందు కొందరు బీఆర్‌ఎస్‌నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా మరికొందరు పార్టీని వీడారు. ఇదిలా ఉండగా వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన మరికొంత మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఆయా నియోజకవర్గాల అధికార పార్టీ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపాక పార్టీలోకి వెళ్లే అవకాశం ఉంది.

‘ఎక్సైజ్’ విభజన ఎప్పుడు?

- ఇంకా వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాగానే ఆబ్కారీ శాఖ
- వరంగల్, హనుమకొండ జిల్లాలు ఏర్పడినా ఎక్కడివక్కడే
- గందరగోళం నడుమ పనిచేస్తున్న ఆ విభాగం అధికారులు
- ఈ ఏడాదైనా తమ శాఖలను జిల్లాలుగా మార్చాలని వేడుకోలు
- చీఫ్ సెక్రటరీ స్థాయిలోనే ఈ నిర్ణయం పెండింగ్ అంటున్న సిబ్బంది



సాక్షి, వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వరంగల్ రూరల్‌ను వరంగల్ జిల్లాగా, వరంగల్ అర్బన్‌ను హనుమకొండ జిల్లాగా మార్చి రెండేళ్లు దాటింది. అయినా కూడా ఎక్సైజ్ విభాగాలు ఇంకా వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాగా కొనసాగుతున్నా పట్టించుకునే ఉన్నతాధికారులు కరువయ్యారు. అయితే, ఎక్సైజ్ విభాగం పనితీరుపై గురువారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులు సమీక్షించనున్నారు. ఈనేపథ్యంలో ఈ అంశం మరోమారు తెరమీదకు వచ్చింది. గతంలోనూ ఆయా జిల్లాల సరిహద్దులకు అనుగుణంగా వైన్స్, బార్లు విభజించాలని కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారులకు నివేదించారు. ఎందుకో ఏమో గానీ ఈ విభజనకు మాత్రం ఆసక్తి చూపలేదు.

అర్బన్ జిల్లాలోనే వరంగల్, ఖిలా వరంగల్ మండలాలు..

2021 ఆగస్టు 13న వరంగల్ రూరల్ జిల్లాలోని పరకాల, నడికూడ, శాయంపేట, ఆత్మకూరు, దామెర మండలాలు హనుమకొండ జిల్లాలో కలిశాయి. వరంగల్ అర్బన్‌లోని వరంగల్, ఖిలావరంగల్ మండలాలను వరంగల్ జిల్లాలో కలిపారు. ఆ తర్వాత ఆయా ప్రభుత్వ విభాగాలు కూడా హద్దుల మేరకు మారి తమ సేవలందిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా ఎక్సైజ్ విభాగానికి మాత్రం ఇప్పటికీ ఈ కొత్త జిల్లాల వర్తింపు కాలేదు. ఫలితంగా ఆ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి తాము ఏ జిల్లానో పక్కాగా చెప్పుకునే పరిస్థితి లేదు. వరంగల్, ఖిలా వరంగల్‌లో వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు ఎక్కువగా ఉన్నాయి. గతంలో వరంగల్ అర్బన్ (ప్రస్తుతం హనుమకొండ) జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు ఆ రెండు మండలాలు వచ్చినా ఇప్పటికీ హనుమకొండ ఎక్సైజ్ విభాగం ఆధీనంలోనే ఉండడం గమనార్హం. వరంగల్ జిల్లా ఏర్పడి దాదాపు రెండేళ్లు దాటినా ఇప్పటికీ ఈ విభాగం వరంగల్ ఎక్సైజ్ పరిధిలోకి రాలేదు. ఆరెండు మండలాలు ఇంకా విలీనం కాలేదు. ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిధిలోకి వెళ్లిన పరకాల, నడికూడ, శాయంపేట, ఆత్మకూరు, దామెర మండలాల్లో పది వరకు వైన్స్‌లు ఉన్నాయి. ఈ రికార్డులను తీసుకునేందుకు హనుమకొండ ఎక్సైజ్ అధికారులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఏదేమైనా ఆదాయం వచ్చే ప్రాంతాలను వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడంతో పెద్ద ఎక్సర్‌సైజ్ చేయాల్సిన అవసరం ఉంది. చీఫ్ సెక్రటరీ స్థాయిలోనే ఈ విభజన ప్రక్రియ ఉందంటూ.. ఈ విభాగాల అధికారులు చేతులు దులుపుకోవడం గమనార్హం. అన్ని ప్రభుత్వ విభాగాలకు వర్తించిన విభజన ఇక్కడ ఎందుకు వర్తించదు అంటే సమాధానం చెప్పేవారు కరువయ్యారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎక్సైజ్ విభాగం విభజన సమయంలో చొరవ చూపాలని అధికారులు కోరుతున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కాశీబుగ్గ సెంటర్ : గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రొమేనియా తదితర దేశాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ నమోదిత ఏజెన్సీలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుని టామ్‌కామ్ ద్వారా ఉద్యోగాలు చేసేందుకు ఈనెల 7 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 91007 98204, 78935 66493, 98496 39539 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వరంగల్ కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్, కమిషనర్



కలెక్టర్ ప్రావీణ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ

కరీమాబాద్ : వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్యను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

గోదామాధవ కేంద్రంలో గాజుల పండుగ


గోదాఅమ్మవారికి గాజుల పూజ చేస్తున్న శ్రీనివాసాచార్య స్వామి

హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో బుధవారం ఉదయం 18వరోజు తిరుప్పావై వ్రత పూజలు నిర్వహించారు. కేంద్రం నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆపదుద్ధారక స్వామికి ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర శతనామార్చనలు, ప్రత్యేక పూజలు, ఆరగింపు, మంగళహారతి నిర్వహించారు. అనంతరం గాజుల పూజ జరిగింది. గోదా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పూలతో శోభాయమానంగా అలకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల గాజులు, పండ్లు, పసుపు, కుంకుమ, తాంబూలాలు సమర్పించారు. కార్యక్రమంలో మెన్నపురెడ్డి రమణారెడ్డి, సరళ దంపతులు, శేషుప్రియ తదితరులు పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన మేకల అనిత తన కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి అదృశ్యమయ్యారు. డిసెంబర్ 30వ తేదీన తల్లి, కుమారుడు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. తిరిగి రాకపోవడంతో అనిత భర్త మల్లయ్య.. వారి కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి బుధవారం తెలిపారు.

జాతరలో భక్తులకు ప్రశాంత దర్శనం

- దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్
- మేడారంలో పూజారులతో సమీక్ష

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మహాజాతరలో భక్తులకు ప్రశాంత దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మేడారంలో పూజారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు జాతరలో పూజా కార్యక్రమాల నిర్వహణ, సౌకర్యాలు, తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతరలో భక్తులు ఇబ్బందులు తలెత్తకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపడతామన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం జాతర నిర్వహిస్తామన్నారు. పూజారులు తమ దృష్టికి తీసుకువచ్చిన వసతులన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. పూజారులకు ఐడీ కార్డులు జారీ చేసి జాతరలో ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. పూజారుల నిర్ణయం మేరకు భక్తుల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి క్యూలైన్ భక్తులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ఈసారి జాతరలో భక్తులు నేరుగా గద్దెలపై బెల్లం విసరకుండా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. జాతరలో దేవాదాయ శాఖ తరపున భవన నిర్మాణం చేపడతామని, దీనికి స్థానికులు భూమి ఇస్తే, భూమికి బదలు భూమి గాని, పరిహారం గాని, పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. మేడారం ఈఓ రాజేంద్రం బదిలీపై వస్తున్న వార్తలు అవాస్తమని, ఆయనను బదిలీ చేసే ఆలోచన లేదన్నారు. కాగా, సమీక్షకు ముందు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరలో దేవాదాయ శాఖ తరపున చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, ఈఓ రాజేంద్రం, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, డీఈ రమేష్, ఏఈ వీరచందర్, పూజారులు రఘుపతి, చంద గోపాల్, మునీందర్, కాక సారయ్య, కాక కిరణ్, సిద్దబోయిన అరుణ్, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.


హన్మకొండ కల్చరల్ : అమ్మవారి సన్నిధిలో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, శ్రీకాంతారావు


తాడ్వాయి : మాట్లాడుతున్న కమిషనర్ అనిల్‌కుమార్

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్

హన్మకొండ కల్చరల్ : చారిత్రక భద్రకాళి దేవాలయాన్ని బుధవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వి. అనిల్‌కుమార్ సందర్శించారు. కమిషనర్ వెంట వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ముందుగా ఆదిశంకరులు, వల్లభగణపతిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో మేడారం సమ్మక్క, సారలమ్మ దేవాలయ ఈఓ రాజేంద్రం , వరంగల్ దేవాదాయశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు వీరస్వామి, పరిశీలకుడు సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి హత్య కేసు ఛేదన..

- మంత్రాల నెపంతోనే ఘాతుకం
- వివరాలు వెల్లడించిన ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు గోనె సోమలక్ష్మి(70) గత నెల 26వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ కేసును పోలీసులు సవాల్‌గా తీసుకుని వారం రోజుల్లోనే ఛేదించారు. ఈ మేరకు బుధవారం ఈస్ట్‌జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ విలేకరుల సమావేశంలో వృద్ధురాలి హత్య వివరాలు వెల్లడించారు. సోమలక్ష్మిని ఆమె చిన్న కుమారుడు సాయిలు హత్య చేయొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి భర్త, ఆమె పెద్ద కుమారుడు మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే సోమలక్ష్మి మృతి చెందిన రాత్రి ఆమె చిన్న కుమారుడు సాయిలు .. ఓ రైస్ మిల్లులో పనికి వెళ్లి అక్కడే నిద్రించాడని సీసీ కెమెరాల ద్వారా తెలిసింది. దీంతో సాయిలు హత్య చేయలేదనే నిర్ధారణకు వచ్చిన పోలీసులు.. వృద్ధురాలిని హత్యచేయాల్సిన అవసరం ఎవరికుందనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సోమలక్ష్మికి మంత్రాలు వస్తాయనే అపవాదు ఉన్నట్లు గుర్తించారు. ఈ కోణంలో దర్యాప్తు ప్రారంభించగా గత నెల 17వ తేదీన సోమలక్ష్మి ఇంటి పక్కన ఉండే గోనె మధు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధు తండ్రి పెద్దరాజు సోమలక్ష్మి ప్రవర్తనను అనుమానించాడు. మధు మృతికి సోమలక్ష్మి కారణమై ఉంటుందని ఆమె పై కోపం పెంచుకున్నాడు. దీంతో సోమలక్ష్మిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. మధు దశదిన కర్మ 27న ఉండగా ముందు రోజు రాత్రి పెదరాజు, తన సడ్డకుడు సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన పెండ్లి యుగంధర్, అల్లుడు అనుముల రంజిత్, చిన్న కుమారుడు అనిల్, అనిల్ స్నేహితుడు ముస్కు రాజశేఖర్ పథకం ప్రకారం సోమలక్ష్మిని కర్రలతో తలపై మోది హత్య చేశారు. ఎవరికీ అనుమానం రావొద్దనే ఉద్దేశంతో సోమలక్ష్మిని మంచంపై పడుకోబెట్టి, చద్దరు కప్పి నిర్మాణంలో ఉన్న గోడల మధ్య ఉంచి వెళ్లిపోయారు. సోమలక్ష్మి చిన్న కుమారుడు సాయిలు మద్యం సేవించి వచ్చి తల్లిదండ్రులను కొడతాడని తెలిసి హత్యను అతడిపై నెట్టే ప్రయత్నం చేశారు. ఆ రోజు సాయిలు రైస్‌మిల్లులోనే ఉన్నాడని పోలీసులు నిర్ధారించుకోగా హత్య కోణం బయట పడిందన్నారు. దీంతో దోషులను అరెస్టు చేసి నిర్దోషి సాయిలుకు శిక్షపడకుండా చేయడం సంతోషం కలిగించిందని డీసీపీ పేర్కొన్నారు. ఐదుగురు నేరస్తుల్లో అనుముల రంజిత్ పరారీలో ఉండగా మిగతా నలుగురిని అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ఏసీపీ చిర్ర సతీష్‌బాబు, సీఐ శ్రీనివాస్, ఎస్సై నవీన్‌కుమార్ ఉన్నారు. కాగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మధు ఆత్మహత్యకు పాల్పడడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. సోమలక్ష్మి మృతికి గల కారణాలను వేగంగా ఛేదించిన పోలీసులు.. మధు ఆత్మహత్య విషయంలో కూడా వేగంగా దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ

గుడుంబా స్థావరాలపై దాడులు

- 15 లీటర్ల సరుకు, 10కిలోల పటిక స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

గోవిందరావుపేట : తాడ్వాయి మండలం నార్లాపూర్, రెడ్డిగూడెం, గోవిందరావు పేట మండలం పాపయ్యపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి 1500 లీటర్లు పులియబెట్టిన బెల్లం పానకం పారబోసి 15 లీటర్ల గుడుంబా, 10కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ శాఖ వరంగల్ డివిజన్ డీసీ అంజన్ రావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆఫీసర్ శ్రీనివాస్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ లతీఫ్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ సీఐ ఆర్ రాజనర్సయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎం కిశోర్ బాబు, ములుగు ఎక్సైజ్ ఎస్సై ఆర్ రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.


గుడుంబా తయారీకి ఉపయోగించే డ్రమ్ములను తగులబెడుతున్న అధికారులు

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

డోర్నకల్: డోర్నకల్ మండలం రాముతండాకు చెందిన బాలుడు వేడినీళ్లు మీద పడి గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండాకు చెందిన నూనావత్ వీరన్న, కల్యాణి దంపతులకు ముగ్గురు కుమారులు భార్గవ్, రామ్, శ్రీలక్ష్మణ్(03) ఉన్నారు. ఇందులో రామ్, శ్రీలక్ష్మణ్ కవలలు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన పిల్లలకు స్నానం చేయించేందుకు కల్యాణి వేడినీళ్లు సిద్ధం చేసింది. పిల్లలు ఆడుకుంటూ వెళ్లి బకెట్‌కు తగలగా వేడినీరు శరీరంపై పడింది. దీంతో శ్రీలక్ష్మణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీలక్ష్మణ్ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదు కాగా శ్రీలక్ష్మణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా, తల్లిదండ్రులు.. శ్రీ లక్ష్మణ్ మృతదేహంపై పడి దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు. శ్రీలక్ష్మణ్ మృతితో కుటుంబంతోపాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు..

పాలకుర్తి టౌన్: తాటిచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన పాలకుర్తి మండలం దర్దేపల్లిలో జరిగిది. గ్రామానికి చెందిన గిరగాని యాకయ్య(47) రోజుమాదిరిగా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో జారి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరారు. కాగా, గీత కార్మికుడి కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని గౌడ జనహక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూల వెంకటేశ్వర్లు గౌడ్ కోరారు.


యాకయ్య (ఫైల్)

కుంటలో పడి వ్యక్తి గల్లంతు

వర్ధన్నపేట: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి కుంటలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బెజ్జంకి వెంకటనర్సింహులు మంగళవారం సాయంత్రం గ్రామశివారులోని కుంటలో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటి గుంతలో పడి గల్లంతయ్యాడు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు గజ ఈతగాళ్లు గాలించినా వెంకటనర్సింహులు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రాత్రి కావడంతో గజఈతగాళ్లు వెనుదిరిగారు.


వెంకటనర్సింహులు కోసం గాలిస్తున్న గజ ఈత గాళ్లు

భార్య జ్ఞాపకాలు మరువలేక..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
- ఛాగల్లులో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: భార్య జ్ఞాపకాలు మరువలేక ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని ఛాగల్లులో జరిగింది. గ్రామానికి చెందిన లొంక వెంకటయ్య(57) భార్య అండాలు నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి వెంకటయ్య మనోవేదనకు గురవుతున్నాడు. కాగా, రెండు రోజుల క్రితం అండాలు నెలమాసికం నిర్వహించారు. అయితే అండాలు జ్ఞాపకాలను మరచిపోని వెంకటయ్య ఇంటి సమీపంలో పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంకటయ్యను వెంటనే అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.


వెంకటయ్య (ఫైల్)

దేవాలయాల భూములను కాపాడాలి

- తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ రాష్ట్రంలో అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని తెలంగాణ అర్చక ఉద్యోగులు జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో జాక్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి కురాకుల, కార్యనిర్వహణాధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ దేవాలయాల వేద పండితులు, అర్చకఉద్యోగులు కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముందుగా అర్చకులు.. ఉపముఖ్యమంత్రిని సన్మానించి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన ఆలయాల భూములను కాపాడి ఉన్నత న్యాయస్థానం అనుమతితో వేలంలో అమ్మివేయడం ద్వారా వచ్చే ఆదాయంతో దేవాలయాలను అభివృద్ధి చేయొచ్చన్నారు. దీనిపై దేవాదాయశాఖ మంత్రితో సమీక్షించాలని కోరారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ నుంచి 577 జీవో ప్రకారం 5,625 మందికి వేతనాలు రావాల్సి ఉండగా 3వేల మందికి మాత్రమే రాష్ట్ర ఖజానా నుంచి ఇస్తున్నారని, దేవాదాయశాఖ ఇచ్చిన 121 జీవోను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయాల రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండేటి కృష్ణమాచారి, భద్రీనారాయణ, నిట్టూరి సతీష్‌శర్మ, పెన్నా మోహన్‌శర్మ పాల్గొన్నారు.


ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో దేవాదాయశాఖ అర్చక ఉద్యోగులు

ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు


విద్యార్థులు వేస్తున్న సైన్స్ బొమ్మలను పరిశీలిస్తున్న నిర్ణేతలు, లెక్చరర్లు

ఏటూరునాగారం: ప్రతిభతోనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని ములుగు జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా పాఠశాలలో బుధవారం భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు చెందిన 966 మందితో ఇగ్నో ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ, ఆర్‌సీఓ ఆగస్టిన్ హాజరై జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా పాఠశాలలు, డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అలరించారు. విద్యార్థులు తయారు చేసిన శకటాలను ముఖ్యఅతిథులు పరిశీలించి ఎంపిక చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ప్రతిభ ఉంటుందని, వాటిని వెలికి తీసేందుకే ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. వారిలో ఉన్న నైపుణ్యం విద్య, క్రీడ, ప్రయోగశాలల్లోనే బయటపడుతుందన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను భద్రాచలంలో జరిగే ఇగ్నో ఫెస్టివల్‌కు పంపించనున్నట్లు గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ ఆగస్టిన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈసం రామ్మూర్తి, రాజారాం, రమణ, జైపాల్ పాల్గొన్నారు.

విద్యార్థుల నూతన ఆవిష్కరణలు


ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ యాకూబ్‌పురాలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో బుధవారం ప్రాంతీయ ఇగ్నైట్ ఫెస్ట్(సైన్స్‌ఫేర్)–2024 జరిగింది. ఈ కార్యక్రమానికి రీజినల్ ట్రైబల్ వెల్ఫేర్ హైస్కూల్స్ కన్వీనర్ వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై సైన్స్ ఫేర్‌ను ప్రారంభించారు. వివిధ గిరిజన రెసిడెన్షియల్ల నుంచి సుమారు 1200 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఆధునిక పరిశోధనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి..

- తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- అంబట్‌పల్లిలో ఘటన


పద్మ (ఫైల్)

మహదేవపూర్: పాత కక్షల నేపథ్యంలో ఓ మహిళపై గొడ్డలితో దాడికి పాల్పడగా ఆమె మృతి చెందింది. ఈ ఘటన మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పాత కక్షల నేపథ్యంలో అంబట్‌పల్లి అమరేశ్వర ఆలయంలో బుధవారం ఉదయం అయ్యప్ప మాలధారుడు పుట్ట నరసింహస్వామి.. మరో మాలధారుడు నల్ల అవినాశ్‌పై కత్తితో దాడికి పాల్పడగా స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనను చూసిన సహా మాలధారులు ఇద్దరిని సముదాయించి ఇంటికి పంపించారు. అనంతరం నరసింహస్వామి గొడ్డలితో అవినాశ్ ఇంటికి చేరుకున్నాడు. అక్కడ అతడు కనిపించకపోవడంతో ఆగ్రహం చెందిన నరసింహస్వామి.. అవినాశ్ తల్లి పద్మ (40)పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న పద్మను స్థానికులు మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీంతో పద్మ మృతదేహానికి ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి అంబట్‌పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై మృతురాలి భర్త నల్ల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

- కేసముద్రం మండల కేంద్రంలో ఘటన

కేసముద్రం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని కిష్టాపురం వీధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి రామచంద్రయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి నెల్లికుదురు మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. కాగా, రామచంద్రయ్య కుమారుడు డ్యూటీకి వెళ్లి బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం తీసి, బీరువా తెరిచి ఉంది. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్, కేసముద్రం ఎస్సై వంశీధర్ ఘటనా స్థలికి చేరుకుని బీరువాను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం చేరుకుని వేలిముద్రలు సేకరించింది. ఈ ఘటనలో దొంగలు 4 తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఘటనను పరిశీలిస్తే బీరువాలో ఇంకా కొంత బంగారం ఉండడంతో పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు.


బీరువాను పరిశీలిస్తున్న రూరల్ సీఐ రమేష్, ఎస్సై వంశీధర్

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సూచించారు. బుధవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయాన్ని ప్రతి విభాగాన్ని పరిశీలించారు. అనంతరం నక్కలగుట్ట విద్యుత్ 33/11 కేవీ సబ్ స్టేషన్, ఎంఆర్‌టీ డివిజన్‌ను పరిశీలించారు. ఏఏ పనులు చేస్తున్నారో ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ స్టోర్స్‌ను సందర్శించారు. స్టోర్స్‌లోని మెటీరియల్‌ను పరిశీలించారు. మెటీరియల్ పంపిణీ, నిర్వహణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దమ్మగడ్డలోని ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్ సందర్శించి విద్యుత్ సరఫరా జరుగుతున్న తీరు, అంతరాయాలు, ఆటంకాలు గురించి ఉద్యోగులను అడిగారు. తర్వాత వరంగల్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల నిర్వహణ క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. వినియోగదారులు సంస్థకు ప్రధానమని, వారికి ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి విధులు సక్రమంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, వరంగల్ ఎస్ఈ మధుసూదన్, డీఈలు జి.సాంబారెడ్డి, ఎ.విజేందర్ రెడ్డి, ఎ.ఆనందం, ఏడీ మల్లికార్జున్, అనిల్ కుమార్, జానకీరాం రెడ్డి, ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.


హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి